తహశీల్దారు కార్యాలయంలో డిఆర్ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు తహశీల్దారు కార్యాలయాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గ కేంద్రం కావడంతో రెవెన్యూ సమస్యలపై అనేక మంది జిల్లా కేంద్రానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ రెవెన్యూ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారికి పలు రకాల ఫిర్యాదులతో వస్తుంటారని తెలిపారు. వాటిని మండల కేంద్రాలలోనే వీలైనంత వరకు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. మండల కేంద్రంలో పరిష్కారానికి వీలుకాని సమస్యలను మాత్రమే జిల్లా కేంద్రానికి పంపాలే తప్ప, సమస్యలన్నిటినీ జిల్లా అధికారులతో ముడిపెట్టవద్దని సూచించారు. పీలేరు తహశీల్దారు శివకుమార్ పనితీరు బాగుందని, సిబ్బంది కొరతతో ప్రజలకు అనుకున్నంత సేవ చేయలేక పోతున్నట్లు గమనించిన డిఆర్ఓ తొందరలోనే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరయ్య, వీఆర్వోలు హేమంత్ నాయక్, సిద్దయ్య, శ్రీనివాసరావు, కళ్యాణి, ఏఎస్ఓ రాఘవ రెడ్డి, సిబ్బంది నాగేంద్రబాబు, జయంతి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ స్వర్ణాంధ్ర-పి-4 కార్యక్రమం, ఐవిఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జెసితోపాటు డిఆర్ఓ మధుసూదన్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పి4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఈనెల 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించిన వాటిపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు, పాస్ బుక్ సర్వే వంటి అంశాలలో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పి పిపి మార్గంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్లు అందరూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఇ ఏర్పాటుపై పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

స్కూల్ బస్సు కింద పడి విద్యార్థి మృతి

- కొడుకు మృతితో తల్లడిల్లిన తల్లి
- నిర్లక్ష్యంగా పాఠశాల యాజమాన్యం

మృతి చెందిన కుమారుడు దివాకర్ మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకుకి అప్పుడే నూరేళ్లు నిండిపోయాయని తెలిసి ఓ తల్లి అల్లాడుతున్న దృశ్యం ప్రజలను కంటతడి పెట్టించింది. తన కొడుకును బాగా చదివించాలని కోటి ఆశలతో కొత్తగా ఓ ప్రయివేటు పాఠశాలలో చేర్పించింది. ప్రతి రోజు తన కొడుకుని అందంగా రెడీ చేసి స్కూలుకు పంపించేది. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి రాగానే నవ్వీస్తూ అక్కున చేర్చుకునేది. అటువంటి బిడ్డ తన కళ్ళ ముందరే చనిపోతుంటే చూసి తట్టుకోలేక ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు..మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పాతకొండ సానివారిపల్లెకు చెందిన ఇడగొట్టి మల్లికార్జున, ఇడగొట్టి శ్రావణి దంపతులకు ఇ.దివాకర్ (3), ఇ.లక్ష్మణ్ ఆదిత్య (11 నెలలు) అను ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి పెద్ద కుమారుడు దివాకర్‌ను నిమ్మనపల్లెలోని ఓ ప్రయివేటు పాఠశాలలో నర్సరీలో చేర్పించారు. ప్రతిరోజు పాఠశాలకు చెందిన బస్సులో స్కూలుకు వెళ్లి వచ్చేవారు. ఇదే క్రమంలో ప్రతిరోజు లాగే గురువారం ఉదయం కూడా స్కూల్ బస్సులో పాఠశాలకు వెళ్లి, తిరిగి సాయంత్రం 4.10 గంటలకు స్కూల్ బస్సులోనే తిరిగి రాగా, విద్యార్థులు స్కూల్ బస్సు దిగి వెలుచుండగా బస్సు డ్రైవర్ విద్యార్థులను గమనించకుండా నిర్లక్ష్యంగా బస్సును ముందుకు కదిలించారన్నారు. విద్యార్థి దివాకర్ బస్సు టైరు కింద పడగా అతనిపై బస్సు వెళ్ళిపోయింది. విద్యార్థుల తల్లిదండ్రులు చూస్తూ ఉండగానే క్షణాలలో ఆ చిన్నారి స్పృహ కోల్పోయారు. ఆ పిల్లవాడిని బతికించుకోవాలన్న కోటి ఆశలతో హుటాహుటిన నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలోని వైద్య సిబ్బంది చికిత్సలు అందించడానికి ప్రయత్నించగా అప్పటికే పిల్లవాడు మృతి చెందినట్లు ధ్రువీకరించారని తెలిపారు. ఎన్నో ఆశలతో పిల్లవాడి భవిష్యత్తుకు కలలు కన్న వారి కలలు ఆవిరవుతూ ఆ పిల్లవాడు మృతి చెందాడు. ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. విద్యార్థి మృతి చెందిన సంఘటన స్థలాన్ని ఎస్ఐ తిప్పేస్వామి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిర్లక్ష్యంగా పాఠశాల యాజమాన్యం : ప్రయివేటు పాఠశాలల యాజమాన్య నిర్లక్ష్యానికి అద్దం పడుతూ ఈ హృదయ విధాకర సంఘటన నిలిచింది. సాధారణంగా స్కూల్ బస్సులను నడపాలంటే అందుకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలి. విద్యార్థులను తీసుకురావడానికి ఏర్పాటు చేసిన బస్సులో 24 మంది ప్రతిరోజు ప్రయాణిస్తున్నారు. ఈ బస్సులో డ్రైవర్ మాత్రమే ఉండడం, విద్యార్థులను బస్సులోకి ఎక్కించడానికి, క్షేమంగా దింపడానికి మరో వ్యక్తి లేకపోవడం పాఠశాల నిర్లక్ష్యానికి అర్థం పడుతున్నాది.

వైజ్ఞానిక ప్రదర్శనకు నామినేషన్ సమర్పించాలి : డిఇఒ

ప్రజాశక్తి - రాయచోటి

ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల కోసం అధిక సంఖ్యలో నామినేషన్లు సమర్పించి జిల్లాను అగ్రస్థానానికి తీసుకురావాలని డిఇఒ సుబ్రమణ్యం సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని డైట్ హాల్‌లో గురువారం జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజనల్ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి ఎక్కువమందితో నామినేషన్లు సమర్పించాలన్నారు. స్థానిక సమస్యలకు పరిష్కారం చూపేటట్లు ప్రాజెక్టులు రూపొందించాలన్నారు. అన్నమయ్య జిల్లాలో 3 వేల ప్రాజెక్టులు లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు చొరవ చూపాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మండలి విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న అవార్డుల కోసం 6-12 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనేటట్లు చూడాలన్నారు. ఒక్కొక్క పాఠశాల నుండి గరిష్టంగా 7 నామినేషన్లు సమర్పించవచ్చునని తెలిపారు. విద్యా ర్థులు సమర్పించిన నామినేషన్లను జాతీయస్థాయిలో పరిశీలించి అత్యుత్తమ అన్వేషణత్మక ఆలోచనలను ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపిక చేస్తారన్నారు. అవార్డుకు ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి రూ. 10 వేలు నగదును అందిస్తారన్నారు. వీరికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రాజెక్టుకు మేథో సంపత్తి హక్కులు ఇస్తారన్నారు. ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులను ప్రోత్సహించి అవార్డుల కోసం సెప్టెంబర్ 15 లోపు నామినేషన్ సమర్పించాలన్నారు. రాయచోటి డివిజన్ పరిధిలోని 11 మండలాల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, రాజంపేట మండల విద్యాశాఖ అధికారి సుబ్బరాయుడు, సెక్టోరియల్ అధికారి జనార్దన్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, రిసోర్స్ సభ్యులు సెట్టెం ఆంజనేయులు, శివలక్ష్మి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యంతోనే దేశానికి సౌభాగ్యం

ప్రజాశక్తి-పీలేరు: బాలల ఆరోగ్యంతోనే దేశ సౌభాగ్యం ముడిపడి ఉందని ఎంపిడిఒ శివశంకర్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి ఎన్‌డిడి టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ 400 యంజి మాత్రను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవడానికి అందరం బాధ్యత వహిద్దామని అన్నారు. ఆల్బెండజోల్ వాడడం వల్ల నులిపురుగుల నివారణ జరిగి విద్యార్థి మంచి తెలివితేటలతో చదువులో రాణించే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాధామాధవి, సిహెచ్‌ఒ సరస్వతి, డిప్యూటీ హెచ్ఇఒలు కొండయ్య, చిన్నప్ప, ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు అక్కాయమ్మ,

ద్రవిడ విప్లవ యోధుడు కరుణానిధి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హేతువాద భావజాల పునాదులపై భారత రాజకీయాల్లో పెను సంచలనం స ృష్టించిన పెరియార్ వారసత్వాన్ని ముందుకు నడపడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ద్రవిడ విప్లవ యోధుడు దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి అని విడుదలై విసికె పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌ఛార్జి బాలసింగం అన్నారు. గురువారం వీసీకే పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ ప్రయివేట్ అతిథి గృహంలో కరుణానిధి వర్థంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణానిధి చిత్రపటం వద్ద ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విసికెఉపార్టీ, బాస్ నాయకులు, కెవి.రమణ, వి.దొరస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర మైనార్టీ సంయుక్త కార్యదర్శిగా షేక్ షాకీర్

ప్రజాశక్తి-పీలేరు

మాజీ సిఎం వైఎస్.జగన్ ఆదేశాల మేరకు, అన్నమయ్య పీలేరు నియో జకవర్గానికి చెందిన షేక్ షాకీర్‌ను పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియ మించినట్లు వైసిపి కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి అధికారికంగా ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా గురువారం పీలేరులో షేక్ షాకీర్ మాట్లాడుతూ తనకు ఈ అరుదైన అవకాశం లభించేందుకు సహకరించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు.

హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రాయచోటి: రాయచోటి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా పర్యాటక శాఖ, తదితర శాఖల ఆధ్వర్యంలో గురువారం ఉదయం రాయచోటిలోని డైట్ కళాశాల నుంచి ఆర్‌టిసి వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం నోడల్ అధికారి నాగభూషణం మాట్లాడుతూ భారతదేశానికి 1947, ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చిందని, మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, బాబాసాహెబ్ అంబేద్కర్ లాంటి ఎంతోమంది త్యాగ ఫలితమే మన దేశానికి స్వాతంత్ర్యం అన్నారు. వారి కృషి, స్వాతంత్ర్యం విలువలను స్మరించుకునేందుకు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు వారి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రపై శిక్షణ

ప్రజాశక్తి- రాయచోటి: అక్షర ఆంధ్ర కార్యక్రమంపై జిల్లా వయోజన విద్యాశాఖ రాయచోటిలోని డైట్ కళాశాలలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ అక్షర ఆంధ్ర, ఉల్లాస్ (సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసంపై అవగాహన) కార్యక్రమాల పై వివిధ అంశాలను వివరించారు. సమాజంలోని వివిధ వృత్తులలో ఉన్న 15 సంవత్సరాల పైబడిన వయోజనులను దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన కార్యక్రమం అన్నారు. ముఖ్యంగా ఎస్‌హెచ్‌జి లబ్ధిదారులు, ఆయాలు, వంట వండేవారు, వివిధ రకాల సహాయకులు, వివిధ కార్యాలయాల కాపలదారులు, తదితరులను అక్షరాస్యులుగా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. 2025-26 సంవత్సరానికి అన్నమయ్య జిల్లాకు 85605 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే లక్ష్యంతో కార్యక్రమం రూపొందించిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన సర్వేను త్వరగా పూర్తిచేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, ఎపిఎంలు, సిఎంఎంలు, ఎంపిడిఒలు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి కల్పన కార్యక్రమంలోని ఎపిఒలు, జిఎస్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా

ఉప ఎన్నికల ప్రచారం

- గ్రామాలకు ఇన్‌ఛార్జులుగా ఎమ్మెల్యేలు!
- బృందాల వారీగా ప్రచార బాధ్యతలు
- పులివెందుల్లో ప్రచారానికి గ్రామాలు కేటాయింపు
- ఒంటిమిట్ట, పులివెందుల్లో మంత్రులు తిష్ట

జిల్లాలో జడ్‌పిటిసి ఉపఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ప్రతి రోజూ టిడిపి, వైసిపి నాయకత్వాలు ఆరు నుంచి ఏడు బృందాలుగా ఏర్పడి ఆయా జడ్‌పిటిసిల పరిధిలోని గ్రామాలను విభజించుకుని ప్రచారం సాగిస్తున్నాయి. పోలింగ్ సమయం దగ్గర పడుతున్న కొద్దీ ఉప ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. ఉప ఎన్నికల ప్రాంతాల్లోని ఆయా గ్రామాల్లో రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు స్వీకరించి ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లిన గ్రామాల్లో అధికార టిడిపి, వైసిపి నాయ కత్వాలు పరస్పరం ఎదురుపడిన సమయంలో ఘర్షణలకు, దాడులు, ప్రతి దాడులు, పరస్పర కేసుల నమోదుతో ఎన్నికల సమరాంగణం దద్ధరిల్లుతోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఉప ఎన్నికల ప్రచారం పతాకస్థాయికి చేరుకుంది. ఒంటిమిట్ట, పులివెందుల మండలాలపై రాష్ట్ర రాజకీయ నాయకత్వం తిష్టవేసింది. పులివెందులకు టిడిపి అభ్యర్థి ఎం.లత తరుపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత, ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తోంది. వీరికి దన్నుగా జిల్లాకు చెందిన కమలాపురం, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు, అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారంలో నిలిచారు. ఒంటిమిట్ట జడ్‌పిటిసి అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డికి ఎన్నికల ప్రచారంలో ఆయా సామాజికవర్గ ప్రజలైన చేనేతలు, ముస్లిములు, దూదేకుల తదితర సామాజిక వర్గాల ఆధారంగా అన్నమయ్య జిల్లాకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సహా గుంటూరు, నెల్లూరు, సత్యసాయి తదితర జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఎన్నికల ప్రచారంలో నిలిచి పర్యవేక్షిస్తున్నారు. జడ్‌పిటిసి పరిధిలోని సామాజికవర్గాల ఆధారంగా సంబంధిత సామాజిక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలను ఇన్‌ఛార్జులుగా నియమించడం గమనార్హం.

సంక్షేమమే ఎజెండాగా..

జిల్లాలోని ఉప ఎన్నికల ప్రచారంలో సంక్షేమ పథకాల అమలు ఆధారంగా ప్రచారం సాగుతోంది. అధికార టిడిపి సూపర్‌సిక్స్ పథకాలను జోరుగా ప్రచారం చేస్తూ ముందుకు సాగుతోంది. వైసిపి సంక్షేమ పథకాల అమలులో, స్థానిక సమస్యల పరిష్కారంలో టిడిపి వైఫల్యాలను ఎండగడుతూ ముందుకు సా గుతోంది. ఇటువంటి పరి స్థితుల నేపథ్యంలో అధికార టిడిపి ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి తీరాల నే పట్టుదలతో దాడులకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోం ది.

దాడులు..ప్రతిదాడులు..

పులివెందుల జడ్‌పిటిసి పరిధిలో నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రెండ్రోజుల కిందట పులివెందులలోచోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పటిష్టం చేసింది. ఉపఎన్నికల ప్రచారాలకు వైసిపి, టిడిపి అభ్యర్థులకు రోజు వారీగా గ్రామాలను కేటాయించడం తెలిసిందే. మితిమీరిన ఎన్నికల ప్రచారం కారణంగానే దాడులు, దౌర్జన్యాలకు కారణమని తెలుస్తోంది. రాష్ట్రానికి మంత్రులు మొదలుకుని పొరుగు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలను సామాజికవర్గాల ఆధారంగా గ్రామాలకు సైతం ఇన్‌ఛార్జులుగా నియమించడం చర్చనీయాంశంగా మారింది.

ఒంటిమిట్టలో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అభ్యర్థి (ఫైల్)

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం : సిజిఎం

సమావేశంలో మాట్లాడుతున్న సిజిఎం జానకిరామ్

ప్రజాశక్తి - రాయచోటి

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ జానకిరామ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యు శాఖకు సంబంధించిన ప్రధాన మంత్రి సూర్యాఘర్ పథకం అమలు విధి విధానాలపైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాకు సంబంధించిన రాయచోటి డివిజన్‌లోని 8 మండలాలకు సంబంధించిన వినియోగదారులకు, ప్రధాన మంత్రి సూర్యాఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించామని చెప్పారు. వినియోగదారులకు, వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, విద్యు శాఖ రాయచోటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యుగందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజి నీర్లు, బ్యాంక్ ఎంప్లాయిస్, పిఎం సూర్య గర్, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

రాజంపేట అర్బన్ : విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆ శాఖ సిజిఎం జానకిరామ్ విద్యుత్ శాఖ సిబ్బందితో సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గృహ అవసరాల కోసం సబ్సిడీతో అందించే ఈ పథకాన్ని ప్రజలకు చేరవేసి పథకాన్ని విరివిగా వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ రాజశేఖరరెడ్డి, డిఇలు సురేంద్రనాథ్, భాస్కర్, మురళీధర్‌రెడ్డి, ఎఇలు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నిర్మూలన

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతి ఒక్కరూ క్షయపై అవగాహన కలిగి ఉండడం వలన క్షయవ్యాధిని దూరం చేయవచ్చునని మండలంలోని నగిరిమడుగు డాక్టర్ రిచార్డ్ స్టీఫెన్ అన్నారు. గురువారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన 104 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిచార్డ్ స్టీఫెన్ మాట్లాడుతూ రెండు వారాలకు పైబడి దగ్గు, గళ్ల పడడం, గళ్లలో రక్తం పడటం, సాయంత్ర వేళల్లో జ్వరం, ఆయాసం, నీరసం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా గుర్తించి సమీపంలోని ఆశవర్కర్, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. పరీక్ష ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు చికిత్స పూర్తిగా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. చికిత్స సమయంలో క్షయవ్యాధి గ్రస్తులకు రూ.వెయ్యి వారి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, టిబి సూపర్‌వైజర్ నాగిరెడ్డి, ఎఎన్ఎం గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంయు రాష్ట్ర కార్యదర్శిగా మహేశ్వరి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మహేశ్వరిని ఎన్నుకున్నట్లు జోనల్ అధ్యక్షులు వినోద్ బాబు అన్నారు. గురువారం రాయచోటి డిపోలో ఎంఎన్ రావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఎలాంటి ఫిర్యాదు లేకుండా ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. సిబ్బంది సమస్యలను డిపిటిఒ దృష్టికి ఎప్పటికప్పుడూ తీసుకుని వెళుతూ పరిష్కారం చేసుకోవాలని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మహేశ్వరి మాట్లాడుతూ సిబ్బందికి ఎలాంటి సమస్యలు వచ్చినా అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని అలాగే తనపై నమ్మకంతో యూనియన్ నాయకులు ఇచ్చిన రాష్ట్ర కార్యదర్శి పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ పిఎస్ఎం రాజు, డిపో చైర్మన్ మల్లికార్జున, ప్రెసిడెంట్ డి.వి సుబ్బయ్య, సెక్రటరీ డి.ఎస్ వాసులు, గ్యారేజ్ సెక్రెటరీ మెహరాజ్, రీజినల్ నాయకులు పివి రమణ, రామాంజులు, ఎంఎస్ ప్రసాద్, ఆర్ వి గోపాల్, డిపో నాయకులు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

పుట్టిన బిడ్డ మానసిక శారీరక ఎదుగుదలకు తల్లిపాలే శ్రేయస్కరమని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా గురువారం రాయచోటి కలెక్టర్‌లోని పీజీ ఆర్ఎస్ హాలులో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యత గురించి ఏ విధమైన అవగాహనను కల్పించారని, అలాగే మీరు వివరించే సమయంలో గుర్తించిన విషయాలను తెలపాలని పేర్కొన్నారు. ఉద్యోగం చేస్తున్న వారికి ఏ విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని ఆవశ్యకతను గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలను అవగాహన కల్పించేందుకు ముందుగా మీరు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో అడగడం జరిగిందని తెలిపారు. తల్లిపాల వల్ల కలిగే లాభాలను ఇతర పాల వల్ల కలిగే లాభాల వ్యత్యాసాలను చూపుతూ వారికి అవగాహన కల్పించాలని అలాంటి డేటా మీ దగ్గర ఉంచుకొని వారికి తెలియజేయాలని అన్నారు. ప్రతి తల్లి కాన్పు అయిన గంటలోపు ముర్రు పాలు తన బిడ్డకు తాగించాలని, దీనివల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఎటువంటి అంటూ వ్యాధులు రాకుండా తోడ్పడుతాయన్నారు. బిడ్డ అన్ని దశల్లోనూ ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని, బిడ్డ మానసికంగా ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో తోడ్పడతాయని, తల్లిపాలుకు మించిన శక్తి, ఆహారం ఎందులోనూ ఉండదని తెలియజేశారు. పుట్టినది మొదలు ఆరు నెలలు పాటు కేవలం తల్లిపాలే తాగించాలని, ఆరు నెలల తర్వాత రెండు సంవత్సరాలు తల్లిపాలుతోపాటు అనుబంధ ఆహారం ఇవ్వాలని, దీనివల్ల బిడ్డ, తల్లి ఆరోగ్యం సంపూర్ణంగా ఉంటుందని తెలియజేశారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బంది ముఖ్యంగా ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ప్రసవించిన ప్రతి తల్లికీ, వారి ఇంటిలోని కుటుంబసభ్యులకూ తల్లి పాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల లో భాగంగా వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా తరచుగా తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జి.ఎస్ డబ్ల్యూ లక్ష్మీపతి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరి తల్లి పాలు ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి తెలియజేశారు. కార్యక్రమం చివరిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వారిచే 'తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా' పోస్టర్లను జాయింట్ కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి హైమావతి, జిఎస్‌డబ్ల్యూ లక్ష్మీపతి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మేథో సంపత్తి హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో గురువారం జిల్లా పరిశ్రమల శాఖ వారి అధ్వర్యంలో ర్యాంప్ ప్రోగ్రాంలో భాగంగా అన్నమయ్య జిల్లా లోని పారిశ్రామిక వేత్తలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేథోసంపత్తి హక్కులపై వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రిన్సిపల్ పి. శివశంకర్, జిల్లా పరిశ్రమల అధికారి కె. కృష్ణ కిశోర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె.నాగార్జున, డి.శంకరప్ప ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్, (ఐపిఆర్),పేటెంట్ రైట్స్, కాఫీ రైట్ లా, డిజిటల్ కాపీ రైట్, ట్రేడ్ సీక్రెట్ ఈ అంశాలపై వర్క్ షాప్ నిర్వహించామని చెప్పారు. ఎలా రిజిస్టర్ చేసుకోవాలి, ఎక్కడ రిజిస్టర్ చేసుకోవాలి, వాటి ప్రాముఖ్యత, ఏదైనా సమస్య వచ్చినపుడు ఎలా పరీక్షరించుకోవాలి, పరిశ్రమలకు కావాల్సిన అవసరాల గురించి, నూతన పారిశ్రామిక పాలసీల గురించి హాజరైన వారికి క్లుప్తంగా వివరించారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఎన్ఐ ఎంఎస్ఎంఇ సంస్థ వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించి, వారికున్న సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు. ప్రభుత్వం నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలను ఉపయోగించుకొని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యగ అవకాశానికి ఎదురు చూడకుండా, ఉద్యోగాల కల్పన దిశగా పరిశ్రమ స్థాపించి, వారు అభివృద్ధి చెందాలని, కార్యక్రమాన్ని ఉపయోగించుకొని తమ మేథో సంపత్తిని పెంపోదించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఐ ఎంఎస్ఎంఇ ప్రతినిధులు రాధా కృష్ణన్, అవినాష్, రవివర్మ పాల్గొన్నారు.

గుంతలతో బురదమయమైన రోడ్డు

రోడ్డు అధ్వానం.. ప్రయాణం నరకం

- అరవీటివాడ్లపల్లికి వెళ్లే దారి గుంతలమయం
- పట్టని అధికారులు

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణం పరిధిలోని స్థానిక బస్టాండ్ నుంచి అరవీటివాడ్లపల్లికి వెళ్లే దారి గుంతల మయంగా బురదమయంగా మారిపోయినది. ఈరోడ్డుపై వెళ్లాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చిలకలూరిపేట, నాయనవారిపల్లి,అరవీటివాళ్లపల్లి, కోటకాడపల్లి వెళ్లాలంటే ఈరోడ్డు ద్వారానే వెళ్లాలని చెబుతున్నారు. బస్టాండ్ లోనే రోడ్డు పరిస్థితి ఇంత దుర్భరంగా ఉందంటే మారుమూల గ్రామాల్లో రోడ్ల దుస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు. వర్షం వచ్చిన రోజు చూస్తే పాదాచార్యులు వెళ్లడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిందేనని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి గుంత లమయంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాల నుంచి రక్షిం చాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కన్నా రజినిని సన్మానిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు

'యల్లటూరు'ను కలిసిన కన్నా రజిని

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

హైకోర్టు న్యాయవాది, జనసేన పార్టీ అధికార ప్రతినిధి కన్నా రజిని గురువారం మన్నూరు ఎల్లమ్మ ఆలయం వద్ద గల యల్లటూరు భవన్‌లో రాజంపేట పార్లమెంట్ ఇన్‌ఛార్జి యల్లటూరు శ్రీనివాసరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరుకు చెందిన జనసైనికుడు మోహనకృష్ణ గత నెలలో రాజంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడని, దానికి సంబంధించిన పోలీసు కేసు ఎఫ్ఐఆర్‌లో కొన్ని తప్పిదాలు జరిగాయని అన్నారు. మృతుడు మోహనకృష్ణ జనసేన పార్టీకి ఎనలేని సేవ చేశాడని, ఈ సమస్యపై పోలీసు వారితో మాట్లాడి జనసైనికుడికి న్యాయం జరిగేలా కృషి చేయాలని శ్రీనివాసరాజును కోరినట్లు తెలిపారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రతి జన సైనికుడు సభ్యత్వ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలని యువతకు సూచించారు. అనంతరం న్యాయవాది రజినిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పైజరిగిన దాడి అమానుషమని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బిసి వర్గానికి చెందిన ఎమ్మెల్సీపై దాడి చేయడం ఎంతవరకు న్యాయ సమ్మతమని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లే ప్రజా ప్రతినిధులకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే చేతులెత్తేయడం సరికాదన్నారు. ఒ డిఐజి స్థాయి అధికారి పత్తి వ్యాపారంగా అభివర్ణించడం ప్రజాస్వామ్య విలువలను దిగజార్చు తుందన్నారు. ఒక గ్రామంలో వాహనం అడ్డగించి, దానిని ధ్వంసం చేయడం, బిసి వర్గానికి చెందిన రమేష్ యాదవ్‌గారిపై, వేల్పుల రాముపై దాడులు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. **ఓటమి భయంతోనే..** ఓటమి భయంతోనే ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి చేశారని వైసిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ అన్నారు. గురువారం బిసి నాయకులతో కలిసి జ్యోతిరావు పూలే విగ్రహానికి కూటమి నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రామాపురం జడ్‌పిటిసి వెంకటరమణ, రాష్ట్ర బిసిసెల్ నాయకులు ఆర్లసుబ్బయ్య, సంజీవయ్య, రమేష్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు సాంబశివ, సర్పంచ్ ఈశ్వరయ్య, రాయచోటి పట్టణ అధ్యక్షులు నవాజ్, నియోజకవర్గ అధ్యక్షులు నాగరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ట్యాంక్ వితరణ

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని శెట్టిగుంట ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన రోజువారి అవసరాలకు అవసరమైనటువంటి వాటర్ ట్యాంక్‌ను వాసవిక్లబ్ ఆధ్వర్యంలో కామిశెట్టి కుటుంబీకులు వితరణ చేశారు. ఇటీవల పాఠశాలకు వెళ్లిన వాసవి క్లబ్ సభ్యులకు సందర్భంలో పాఠశాల అధ్యాపక బృందం రెండు వేల లీటర్ల నీళ్ల ట్యాంక్ పాఠశాలకు అవసరమని తెలుపగా వెంటనే సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుండే వాసవి క్లబ్ సభ్యులు కామిశెట్టి బద్రీనాథ్, కామిశెట్టి గోవర్ధన్ కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నీళ్ల ట్యాంక్ డొనేట్ చేస్తామని మాట ఇచ్చారని, వాటర్ ట్యాంకును వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్కూల్ అధ్యాపక బృందానికి అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్ పెండ్యాల విజయకుమార్, రీజినల్ చైర్మన్ గాదంశెట్టి సుమన్‌కుమార్, వాసవిక్లబ్ ప్రెసిడెంట్ టి.సత్యనారా యణ, కోశాధికారి టి.దశరథ, వాసవి క్లబ్ సభ్యులు కామిశెట్టి బద్రీనాథ్, గోవర్ధన్‌రావు, గర్రె సత్యం, తిరుపాలు నరసయ్య, మల్లికార్జున, ప్రతాప్ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రెస్టారెంట్‌కు వచ్చే కస్టమర్లకు నాణ్యతతో కూడిన పదార్థాలను అందించి మంచి పేరుతెచ్చుకోవాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్‌రాయుడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో అరవింద్ నేత్రాలయం పక్కన నాగినేని దివాకర్ నాయుడు ఆహ్వానం మేరకు టసౌథర్న్ స్పైస్ అరబిక్ మండి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. రెస్టారెంట్ యజమాని గంద్రా శ్రీహరినాయుడు బాణాసంచా పేలుస్తూ, బత్యాలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ ప్రజలకు రుచికరమైన, నాణ్యమై ఆహారం అందించి కస్టమర్ల మన్ననలు పొంది దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు బాపనయ్య నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ జిలాని, వాణిజ్య విభాగం పార్లమెంట్ అధికార ప్రతినిధి ఉన్నం కిరణ్ కుమార్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న బత్యాల చెంగల్‌రాయుడు

పిడుగుపాటుకు ఇల్లు ధ్వంసం

- పరిశీలించిన అధికారులు

పిడుగుపాటుకు ధ్వంసమైన ఇల్లు

కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పిడుగు పడి ఓ ఇల్లు ధ్వంసమైన సంఘటన మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అగ్రహారం పంచాయతీ బండమీద దళితవాడలో కె.వెంకటరమణ తన భార్య సరోజ తో కలిసి నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 6.30 గంటలకు ఉరుములు మెరుపులతో జోరున వర్షం పడుతున్న సమయంలో హఠాత్తుగా వెంకటరమణ ఇంటిపై పిడుగు పడటంతో ఆ ఇల్లు ధ్వంసం అయింది. ఇంటి పైకప్పు రేకులు, గోడలు మొత్తం దెబ్బ తిన్నాయి. ఇంటికి చెందిన విద్యుత్ మీటర్, ఇంటిలోని సామగ్రి, వంట సామగ్రి, బియ్యం చల్లాచెదురయ్యాయి. పిడుగు పడిన సమయంలో వారు ఇంటి బయట ఉండడంతో ప్రాణ నష్టం తప్పింది. పిడుగుపాటుకు పల్లెలోకి విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ కూడా కాలిపో యింది. చుట్టుపక్కల ఇళ్లల్లో సైతం టివిలు, మీటర్లు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో పల్లెలోని ప్రజలకు స్వల్పంగా విద్యుదాఘాతినికి గురైనట్లు అనిపించిందని స్థానికులు అన్నారు. పిడుగు ప్రభావంతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఆర్ఐ రమేష్, స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి, విఆర్ఒ ప్రవీణ్ కుమార్‌తో కలసి పిడుగు పడిన స్థలాన్ని పరిశీలించారు. పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇల్లు, సామగ్రిని పరిశీలించారు. గ్రామానికి చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా పిడుగు ప్రభా వానికి దెబ్బతిన్నట్లు గమనించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, బాధితునికి కలిగిన నష్టం పై నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించినట్లు తెలిపారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మన్‌ను వెంటనే ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. బాధితుడి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

తడి, పొడి చెత్తతో సంపద తయారీ : డిపిఒ

చెత్త తరలింపుపై సూచనలు ఇస్తున్న డిపిఒ రమదేవి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా చేపట్టాలని, చెత్త ద్వారా సంపదను సృష్టించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి రమాదేవి పేర్కొన్నారు. గురువారం మట్లి పంచాయతీలో యల్లంపల్లి, వడ్డేపల్లి, తొగటపల్లి, పెద్దూరు, గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియ, చెత్త నుంచి సంపాదనను సృష్టించే విధానాన్ని గ్రామ ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందజేసిన ప్లాస్టిక్ డబ్బాలు వినియోగిస్తూ తడిపొడి చెత్తను వేరు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ వచ్చినప్పుడు తప్పనిసరిగా చెత్తను వారికి అందించాలన్నారు. చెత్తను రోడ్డు మీద వేయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతిరోజు ఇంటింటా నుంచి చెత్త సేకరణ కార్యక్రమం పక్కాగా జరగాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం సంపద సృష్టి తయారీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, గ్రీన్ అంబాసిడర్స్, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సుందరవనంగా సంపద కేంద్రాలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : సంపద తయారీ కేంద్రాలను సుందరవనంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. రెడ్డివారిపల్లి సంపద తయారీ కేంద్రాన్ని పంచాయతీ కార్యదర్శితో కలసి పరిశీలించారు. అక్కడ చెత్త నుంచి తయారు చేస్తున్న ఎరువును తనిఖీ చేశారు. డంపింగ్‌యార్డ్‌లో ఉన్న ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టిస్తున్న కేంద్రాలను సుందరవనాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. పండ్ల మొక్కలను నాటి వాటిని సంరక్షించాని సూచిం చారు. తడి పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డులో ఉంచాల న్నారు. డంపింగ్ యార్డులను సుందర వనాలుగా తీర్చిది ద్దాల్సిన బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల దేనని పేర్కొన్నారు. మండలంలో ఇంకా కొన్ని గ్రామా లలో సంపద తయారీ కేంద్రాల నిర్వహణ మెరుగు పడాలని అన్నారు. ఆ దిశగా పంచాయతీ కార్యదర్శులకు కూడా తగు సూచ నలు ఇచ్చినట్లు వివరించారు. తయారచేసిన ఎరువును రైతులకు విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ

సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న కుడా చైర్మన్, ఎమ్మెల్యే

అభివృద్ధికి నాంది పలుకుతున్నాం : 'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు నుంచి గాదెల కొత్తపల్లి సబ్ స్టేషన్ వరకు రూ.1.70కోట్ల వ్యయంతో నిర్మించబోయే సిసి రోడ్డుకు కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి, ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలు అక్కడికి అక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామ అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని పల్లె పల్లెకి రోడ్డు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని అన్నారు. ప్రతి కుటుంబానికి మంచి జరిగేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం గ్రామ ప్రజలు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా తమ గ్రామంలో రోడ్డు చాలా అధ్వానంగా ఉందని వర్షాకాలం కురిస్తే రోడ్లు కుంటలుగా తయారై గ్రామ ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవడం జరుగుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో అనేకమంది అధికారులకు తమ సమస్యను విన్నవించిన కూడా పట్టించుకునే అధికారి కానీ రాజకీయ నాయకుడు కానీ లేరని తెలిపారు. రూపానందరెడ్డి చొరవతో సిసి రోడ్డు ఏర్పా టు చేయడం సంతోషంగా ఉందని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు, వెంకటరమణ, కూటమి నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రం మండల సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఆధారిత ప్రకృతి వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మండల వ్యవసాయ సంచాలకులు ఎం.జయరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రకృతి వ్యవసాయ ప్రాధాన్యత, ప్రకృతి వ్యవసాయం, మౌలిక విధానాలను సిబ్బందికి వివరించారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని తెలిపారు. అనంతరం అనంతపురం పంచాయతీ చౌటపల్లి గ్రామ రైతులకు ఎపిసిఎల్ఎఫ్ ఆధ్వర్యంలో ఘన జీవామృతం, విత్తన గుళికల తయారీ, నీమాస్త్రం తయారీ, ఎటిఎం పద్ధతులు, పిఎండిఎస్ పద్ధతులు, ఎ గ్రేడ్ మోడల్, వివిధ సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఖర్చు తక్కువ అధిక దిగుబడితోపాటు ఆరోగ్యకరమైన పంట చేతికి వస్తుందని ఆశించిన లాభాలు రైతులు గడిస్తారని తెలిపారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి, వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలాల వ్యవసాయ అధికారులు, రైతుసేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జయరాణి

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ భావన

బొప్పాయి కిలో రూ.9 తగ్గకుండా కొనాలి

- రాజంపేట సబ్ కలెక్టర్ భావన

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

బొప్పాయి రైతుల నుంచి కిలో రూ.9లు తగ్గకుండా కొనాలని అంతకు తక్కువగా రైతుల నుంచి కొంటె వ్యాపారస్తులపై తగిన చర్యలు తీసుకుంటామని రాజంపేట సబ్ కలెక్టర్ భావన పేర్కొన్నార్లు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్‌హెగ్డే, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభా షిని, తహశీల్దార్ అమర్నాథ్‌తో కలిసి గురువారం సాయంత్రం బొప్పాయి రైతుల సమస్యలపై వ్యాపారస్తులు, దళారులు, సప్లయర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 1న జిల్లా కలెక్టర్ బొప్పాయి వ్యాపారస్తులతో సమావేశాన్ని నిర్వహించి 6వ తేదీ నుంచి బొప్పా యి కిలో పది రూపాయలకు తగ్గకుండా కొనే విధంగా ఒప్పించడం జరిగిందన్నారు. అయితే బొప్పాయి వ్యాపారస్తులు దళారులు తదితరులు కిలో రూ.8కి తగ్గించి కొంటున్నారని ఇది రైతులకు చాలా నష్టదామ యకంగా ఉంటుందని అన్నారు. బొప్పాయి కిలో రూ.9లు తగ్గకుండా కొనాలని అన్నారు. అలా కొనకపోతే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెక్ పోస్టుల దగ్గర విఆర్ఒ, విహెచ్ఒ, ట్రాన్స్‌పోర్ట్ శాఖ సిబ్బంది తదితరులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి లారీలలో వెళ్లే బొప్పాయి రూ.9కి తగ్గకుండా కొంటున్నారో లేదో తనిఖీ నిర్వహించి పంపాలని రాజంపేట పోలీస్, తహశీల్దార్ అధికారులను ఆదేశించారు.

కళాశాల క్రీడా మైదానాన్ని కాపాడాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని దురాక్రమణల నుంచి కాపాడాలని టిడిపి నాయకులు, స్థానికులు కోరారు. గురువారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని స్థానికులు కొందరు సొంత అవసరాలకు ఆక్రమించుకున్నట్లు తెలిపారు. దీనివల్ల మైదానం విస్తీర్ణం చాలా వరకు తగ్గిపోయి విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి కళాశాల మైదానాన్ని సర్వే చేయించి మైదానాన్ని దురాక్రమణల నుంచి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బిసి నాయకులు చంద్రశేఖర్, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, టైలర్ శీన, రెడ్డప్ప, అమరనాథ్ పాల్గొన్నారు.

నేడు కలికిరి యువకుడు నటించిన

'భళారే సిత్రం' సినిమా విడుదల

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరికి చెందిన యువకుడు అస్లాం మొదటిసారిగా అరంగేట్రం చేసిన భళారే సిత్రం శుక్రవారం స్థానిక ఆర్ఎస్ఆర్ థియేటర్లో విడుదల కానుంది. అస్లాం కలికిరిలో ఎల్ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్న రసూల్ సాహెబ్ కుమారుడు. అస్లాం మాట్లాడుతూ సినిమాలపై ఉన్న ఆసక్తితో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టానని, మొదటిసారి హీరోగా అవకాశం వచ్చినందుకు ఆనందం వ్యక్తం చేశారు. భళారే చిత్రం శుక్రవారం ఉదయం రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానున్నదని సొంత ఊరు కలికిరి లోని కుటుంబ సభ్యులు బంధుమిత్రులు మధ్య ఆర్ఎస్ఆర్ థియేటర్లో చిత్రం విడుదల కావడం పట్ల జీవితంలో మరుపురాని సంఘటన అని, ప్రతి ఒక్కరు ఈ సినిమా చూసి ఆదరించి నన్ను దీవించాలని కోరారు. ఎంతో వ్యయ ప్రయసాలతో సినిమా నిర్మించామని అన్నారు. మూరుమూల ప్రాంతం నుంచి సినీరంగ ప్రవేశం చేశానన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

వివిధ కారణాల అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అత్యంత ఉపయోగకరమని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు నియోజకవర్గంలో అనేక కారణాల వల్ల అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స పొందిన పేదలకు ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల అనారోగ్యంతో బాధపడుతూ అప్పులు చేసి చికిత్స పొంది సిఎం సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా 18 మంది లబ్ధిదారుల కుటుంబాలకు రూ.22.99లక్షలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నిజాముద్దీన్, సహకార బ్యాంక్ చైర్మన్ చంద్రకుమార్ రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి- కలకడ

కారు చీకటిలో ఉన్న గ్రామానికి విధి దీపాలు ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. కలకడ పంచాయతీ కె.కొత్తపల్లి దళితవాడలో దీపాలు లేక చీకటిలో గ్రామస్తులు ఉన్నట్లు గ్రామస్తులంతా కలిసి సర్పంచ్ ప్యారిజాన్ జావిద్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ స్థానిక ఎంపిడిఒ భానుప్ర సాద్, పంచాయతీ కార్యదర్శి శైలజ, సర్పంచులను కలసి విన్నవించుకోవడంతో ఎంపిడిఒ ఆదేశాల మేరకు కొత్తపల్లి దళితవాడలో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ గ్రామంలో వీధి దీపాలు లేకపోవడం వల్ల విషపురుగులతో గ్రామస్తులను భయభ్రాంతులకు చేస్తున్నట్లు స్థానిక అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిపారు. వీధిదీపాల ఏర్పాటుతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

సబిహాభాను(ఫైల్ ఫొటో)

వివాహిత మహిళా అదృశ్యమైన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందినట్లు స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. నిమ్మనపల్లెలోని తవళం రోడ్డులో సజద్‌ఖాన్ తన భార్య సబిహా భానుతో కలిసి నివాసం ఉంటున్నారని అన్నారు. ఈనెల 5న మధ్యాహ్నం తన భార్య పాఠశాలలోని తన కుమారుడికి భోజనం క్యారీ ఇచ్చి వస్తానని ఇంటి నుంచి వెళ్లిందన్నారు. ఆమె ఎంతసేపటికి ఇంటికి తిరిగి రాలేదన్నారు. ఆమె భర్త, కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికిన కనిపించలేదన్నారు. భార్య కనిపించకపోవడంతో ఆమె భర్త స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసినవారు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

బైక్‌కు చీర చుట్టుకుని మహిళకు గాయాలు.. పరిస్థితి విషమం

ప్రజాశక్తి-ములకలచెరువు

ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకుని కుమారుడితో బైకులో ఇంటికి వస్తుండగా, చీర కొంగు బైకు వెనక చక్రానికి చుట్టుకుని పడి మహిళ పరిస్థితి విషమించింది. గురువారం మధ్యాహ్నం జరిగిన ఘటనపై బాధితుల కథనం.. జిల్లాలోని ములకలచెరువుకు చెందిన పెయింటర్ వెంకటరమణ భార్య శాంతమ్మ ఆరోగ్యం బాగా లేకపోవడంతో తన కుమారుని వెంట మదనపల్లికి వచ్చి ఆసుపత్రిలో చికిత్సలు పొంది తిరిగి బైకులో ఇంటికి బయలుదేరారు. ద్విచక్రవాహనం మార్గమధ్యంలోని వేపూరు కోట వద్దకు రాగానే, చీరకొంగు బైక్ వెనుక చక్రంలో చుట్టుకుని పడి తీవ్రంగా గాయపడింది. బాధితురాలిని వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించే పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని కలిబండ గ్రామం, కొల్లవాండ్లపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి(38)అనే వ్యక్తి గురు వారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తిని రాయచోటి ఆసుపత్రికి తీసుకురాగా పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు డాక్టర్స్ రిఫర్ చేశారు. కడప రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడని తెలిపారు. ఈశ్వర్ రెడ్డి కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, ఈశ్వర రెడ్డికి కొడుకు, కుమార్తె ఉన్నారని బంధువులు తెలియజేశారు. చిన్నమండెం ఎస్ఐ వి.సుధాకర్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం, కలిచర్ల పంచాయతీ గుర్రంవాండ్లపల్లికు చెందిన పూజిత తన అక్క కుమార్తె కోమలిని ద్విచక్ర వాహనంలో కూర్చోబెట్టుకుని మదనపల్లెకి బయలు దేరింది. మార్గమధ్యంలోని కురబలకోట మండలం, ముదివేడు క్రాస్‌కు వద్ద ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కిందపడి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. ముదివేడు పోలీసులు విచారిస్తున్నారు.

చెరువులో పడి గుర్తుతెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చెరువులో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రెండో పట్టణ పోలీసుల కథనం మేరకు..పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని కోమటివాని చెరువుకట్టపై సుమారు 65 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వృద్ధుడు గురువారం నడుచుకుంటూ వెళ్తూ ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. అటుగా వెళ్తున్న యువకులు గుర్తించి హుటాహుటిన వృద్ధున్ని వెలికి తీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వృద్ధునికి సంబందించిన కుటుంబ సభ్యులు కానీ, బంధువులు కానీ ఉంటే రెండవ పట్టణ పోలీసులను సంప్రదించి మృతదేహాన్ని తీసుకెళ్లవచ్చని తెలిపారు.